క్లుప్తంగా

'పట్టభద్రుల' ఎన్నికలకు ఒక నామినేషన్ దాఖలు



నామినేషన్ స్వీకరిస్తున్న ఆర్‌ఓ వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన గుండుమోలు బాలాజీ నామినేషన్ దాఖలు చేశారు. ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని ఏలూరు కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి సమర్పించారు. అభ్యర్థి గుండుమోలు బాలాజీతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు.

ఏలూరు కార్పొరేషన్ పీఓగా మహాలక్ష్మి



మహాలక్ష్మి

ఏలూరు (టూటౌన్): నగరపాలక సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ గా (పీఓ) బి.మహాలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎంవీఎస్‌కే కృష్ణమూర్తిని టౌన్ ప్లానింగ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

జ్ఞానం, నైపుణ్యాలను నవీకరించుకోవాలి



స్కిల్ అవర్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు తమ జ్ఞానం, నైపుణ్యాలను నిరంతరం నవీకరించుకోవడం అతి ముఖ్యమని లిక్విల్ ఇండియా సానిటరీవేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సేఫ్టీ మేనేజర్ పి.ప్రవీణ్ అన్నారు. ఐటీఐ కళాశాలల్లో విద్యార్థులను ప్రామాణిక పాఠ్యాంశాలకు మించి నైపుణ్యాలతో సన్నద్ధం చేయడానికి గతేడాది నవంబర్‌లో ఉపాధి, శిక్షణ శాఖ రాష్ట్ర సంచాలకులు ప్రవేశ పెట్టిన స్కిల్ అవర్ కార్యక్రమాన్ని బుధవారం ఏలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో లిక్విల్ ఇండియా సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ కె.లోకేష్, క్వాలిటీ కంట్రోలర్ శ్రీనివాస్, ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఆచూకీ లేదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని ఓ పాఠశాలలో పని చేస్తున్న ఒక ఉపాధ్యాయుని ఆచూకీ గతేడాది ఏప్రిల్ నుంచి తెలియడం లేదని వెంటనే సదరు ఉపాధ్యాయుడు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని డీఈఓ ఎం వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. వేలేరుపాడు మండలం రుద్రమకోట ఎంపీపీ స్కూల్‌లో ఎస్‌జీటీగా పని చేస్తున్న మల్లం శ్రీనివాసరావు గతేడాది ఏప్రిల్ 8 నుంచి విధులకు గైర్హాజరౌతున్నారని తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు ఎక్కడ ఉన్నది, ఏం చేస్తున్నది తెలియడం లేదని వేలేరుపాడు ఎంఈఓ తెలిపారని పేర్కొన్నారు. గత సెప్టెంబర్ 25న శ్రీనివాసరావుకు షోకాజు నోటీసు జారీ చేసినప్పటికీ ఆయన నుంచి ఎటువంటి వివరణ రాలేదని తెలిపారు. డీఈఓ కార్యాలయంలో వ్యక్తిగతంగా నిర్ణీత గడువులోగా రిపోర్ట్ చేయకుంటే సేవల నుంచి తీసివేస్తామని స్పష్టం చేశారు.

1/70పై ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలి

ఏలూరు (టూటౌన్): 1/70 చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని గిరిజనులకు స్పష్టం చేయాలని, గిరిజన చట్టాలను నీరుగార్చే పద్ధతులను మానుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏజెన్సీలో అభివృద్ధికి 1/70 చట్టాన్ని సవరించాలని విశాఖపట్నంలో శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన ప్రకటన ఆదివాసీల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఈ ప్రతిపాదన స్పీకర్‌దా లేక రాష్ట్ర ప్రభుత్వ వైఖరా అనే విషయాన్ని స్పష్టం చేయాలని కోరారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతం రాజ్యాంగం 5వ షెడ్యూలు కిందకు వస్తుందని, దీన్ని దిక్కరించే అధికారం ప్రభుత్వానికి కూడా లేదని తెలిపారు. టూరిజం అభివృద్ధి పేరుతో పలు చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని, బినామీల పేరుతో గిరిజన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, గిరిజనులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల పోలీస్ స్టేషన్లలో గిరిజనులపై వందలాది కేసులు నమోదయ్యాయని, భూస్వాములపై ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం దారుణమని వివరించారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రవి డిమాండ్ చేశారు.

కమ్యూనిటీ హాళ్లకు గ్రహణం

- నిర్మాణాల్లో కదలిక ఎప్పుడో?
- ప్రభుత్వం మారడంతో నిర్లక్ష్యం
- వైఎస్సార్ సీపీ హయాంలోనే ఏలూరులో 30కి పైగా హాళ్ల కేటాయింపు
- 25 బీసీ కులాలకు స్థలాలు, నిధులు కేటాయింపు



అమీనా పేట ఏటిగట్టు ప్రాంతంలో నిలిచిన మాలమహానాడు భవనం



శంకుస్థాపన శిలాఫలకం



ఏటిగట్టు ప్రాంతంలో తుదిదశకు చేరిన రజక కమ్యూనిటీ హాలు నిర్మాణం



ఆదివారపుపేటలో నిర్మించిన రజక సంఘ భవనం

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో అడిగిన ప్రతి ఒక్కరికీ కులాల వారీగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలు, నిధులు కేటాయించారు. ఎంతో ముందు చూపుతో శుభ, అశుభ కార్యక్రమాల నిర్వహణకు ఒక ఏలూరు నియోజకవర్గం పరిధిలో 30కి పైగా కమ్యూనిటీ హాళ్లకు స్థలాలు, నిధులు కేటాయించారు. వీటిలో కొన్నే నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొన్ని నిర్మాణ పనులు వివిధ దశల్లో ఆగి పోయాయి. 2023 డిసెంబర్ తరువాత బిల్లులు నిలిచిపోవడంతో నిర్మాణాల ప్రగతి మందగించింది. రాష్ట్రంలో కూటమి నాయకులు అధికారం చేపట్టి ఎనిమిది నెలలు కావస్తున్నా కమ్యూనిటీ హాళ్ళు, సమావేశ మందిరాల నిర్మాణాల పూర్తికి తీసుకున్న చర్యలు శూన్యమే.

స్థలాలు, నిధులు కేటాయింపు ఇలా..

వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరు నియోజకవర్గంలో 25 వివిధ బీసీ సామాజిక తరగతుల వారికి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు స్థలాలు, నిధులు పెద్ద ఎత్తున కేటాయించారు. ఏలూరులో యాదవ సంఘం జిల్లా, నగర కార్యాలయానికి 350 గజాల స్థలం, రూ.14 లక్షలు, రజక సంఘానికి స్థలాన్ని, రూ.14 లక్షలు, తెలుకుల సంఘానికి 500 గజాల స్థలం, రూ.10 లక్షలు నిధులు, శ్రీశయన సంఘానికి రూ.14 లక్షలు, గౌడ సంఘ, నాయీబ్రాహ్మణ సంఘాలకు స్థలాలతో పాటు రూ.10 లక్షలు చొప్పున నిధులు అందించారు.

- తంగెళ్లమూడి ప్రాంతంలో మాదిగలకు, అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలో మాలలకు కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు స్థలలు, నిధులు కేటాయించారు. నిధుల విడుదల జాప్యం కారణంగా ఎస్సీ భవన్ నిర్మాణం సగంలోనే నిలిచిపోయింది.

సంక్షేమానికి పెద్దపీట

వైఎస్సార్ సీపీ హయాంలో పేదల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఎన్నో ఏళ్ల కమ్యూనిటీ హాల్ కలను సాకారం చేసే విధంగా స్థలాలు, నిధులు కేటాయించడం గొప్ప విషయం. సగంలో నిలిచిపోయిన ఎస్సీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించి పూర్తి చేయాలి.

– గారపాటి నాగేశ్వరరావు, ఎస్సీ నాయకులు, ఏలూరు

నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన వివిధ కులాలు, సంఘాల భవనాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. కమ్యూనిటీ హాల్స్ భవనాల్లో అధికంగా బీసీ, ఎస్సీలకు సంబంధించినవే ఉన్నందున వీటి నిర్మాణం పూర్తయితే ఆయా వర్గాలకు ఎంతో మేలు జరుగుతుంది.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు, ఏలూరు

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్) / ఏలూరు టౌన్: స్థానిక ఇస్రాయేలు పేటలో ఇటీవల షార్ట్ షర్క్యూట్‌తో రెండు తాటాకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో నిరాశ్రయులైన రెండు కుటుంబాల వారికి గ్రేట్ ఫుల్ గిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, బియ్యం, చీరలు సొసైటీ అధ్యక్షుడు సొంగ మధు, కార్యదర్శి యర్రా జయదాస్, సభ్యులు బుధవారం పంపిణీ చేశారు. న్యాయవాది కలపాల రవి, కడిమి యోహాను,పెన్యాల జ్యోతి,కత్తి బాజీ,కోలా ఐజక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగొద్దు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా మేలు చేసే నాయకులను ఓటుహక్కు ద్వారా ఎన్నుకోవాలని పెదపాడు తహసీల్దార్ కె.కృష్ణజ్యోతి సూచించారు. స్థానిక సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏటా రెండు సార్లు జనవరి, జూలై నెలల్లో ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో ఓటర్ పాత్ర చాలా కీలకమన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఓటుహక్కు విలువ తెలుసుకోవాలని సూచించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి శ్రీనివాస్ డాంగ్, కె.బుచ్చిబాబులు మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వమే పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాల స్థానంలో కరోనా సమయంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని గుర్తుచేశారు. ఈ కోడ్‌ల వల్ల కార్మిక హక్కులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. వికసిత భారత్ పేరుతో మోదీ ప్రభుత్వం కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చి, వారి శ్రమను కొల్లగొట్టేందుకే ఈ లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. తక్షణమే ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు వీవీఎస్ ప్రసాద్, వైఎస్ కనకారావు, జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, జి.రవి కిషోర్, జై.గోపి, అమర్ కుమార్, జాన్ బాబు, లోకేశ్వరి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ, ఏఐటీయూ జిల్లా నాయకులు తొర్లపాటి బాబు, బండి వెంకటేశ్వరరావు భజంత్రీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడకు సంఘీభావం



పద్మనాభంతో వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ మంత్రులు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ఆయన ఇంటిలో మాజీ మంత్రులు, ఎమ్మెల్సీ, ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన ఇంటిపై దాడి నేపథ్యంలో కొద్దిసేపు చర్చించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాబోయే రోజుల్లో పోరాటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ముద్రగడ కుటుంబానికి పార్టీ అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. సంఘీభావం తెలిపిన వారిలో మాజీ మంత్రులు పేర్నినాని, అంబటి రాంబాబు, కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, అవనిగడ్డ సమన్వయకర్త సింహాద్రి రమేష్, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మాజీ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కాపు నాయకులు ఉన్నారు.

దాడి హేయమైన చర్య

జయప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మారణకాండకు కూటమి ప్రభుత్వం తెరలేపిందన్నారు. కాపు ఉద్యమనేత ముద్రగడ ఇంటిపై దాడి చేయటం హేయమైన చర్య అన్నారు. మున్సిపల్, నగరపాలక సంస్థల్లో డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్ల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అరాచకాలు సృష్టిస్తూ, ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తూ, కిడ్నాప్‌లకు తెగబడుతూ ఇష్టారాజ్యంగా చేసిందని విమర్శించారు. ప్రజలు పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఎన్నికల హామీలను అమలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని అన్నారు.

చిన్నారులకు మనోధైర్యం నింపిన కలెక్టర్



కలెక్టర్ వెట్రిసెల్వితో చిన్నారులు

ఏలూరు(మెట్రో): చిన్నారులపై మారు తండ్రి చేసిన పాశవిక దాడి చూసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి చలించిపోయారు. వారికి విద్య, వైద్యం, అందించేందుకు ముందుకొచ్చారు. ఏలూరుకు తీసుకొచ్చిన పిల్లలను అక్కున చేర్చుకుని వారిలో మనోధైర్యం నింపారు. గత ఆదివారం జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన అన్నా చెల్లెళ్లను మారు తండ్రి చిత్రహింసలు గురి చేశాడు. తీవ్ర గాయాలతో ఉన్న వారిని జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో చికిత్స చేశారు. వారిని బుధవారం డిశ్చార్జి చేశారు. వారిని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారతాధికారి పి.శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి సీహెచ్ సూర్య చక్రవేణి ఏలూరులోని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వద్దకు తీసుకొచ్చారు. వారితో కలెక్టర్ మాట్లాడారు. లైసెన్స్ పొందిన చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్‌లో వారికి వసతి కల్పించారు.

వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలి



ఏలూరులో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కాకులను కొట్టి గెద్దలకు పెట్టిన చందంగా కార్మికులు, రైతులపై భారాలు వేసి కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టే విధంగా ఉందని రైతు, కార్మిక, వ్యవసాయ సంఘాల నేతలు విమర్శించారు. ఏలూరులోని వసంత మహల్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేసి కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలో నూటికి 70 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, వీరికి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కేవలం 2.51 శాతం రూ. 1,71,437 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎరువుల సబ్సిడీలో రూ.3,412 కోట్లు కోత విధించారని విమర్శించారు. వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం, పునరావాసం గురించి ప్రస్తావనే లేదని మండిపడ్డారు. విభజన హామీలను పక్కన పెట్టి ఆంధ్ర రాష్ట్రానికి మొండి చేయి చూపడం అన్యాయమన్నారు. ఆయా సంఘాల నాయకులు బి.సోమయ్య, వీవీఎస్ ప్రసాద్, వైఎస్ కనకారావు, జె.గోపి, గొట్టాపు రవి కిషోర్ పాల్గొన్నారు.

హసన్ షరీఫ్ ఎన్నికల ప్రచారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పట్టభద్రులు తమ ఓటు తనకు వేసి గెలిపించాలని, వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హసన్ షరీఫ్ అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి హసన్ షరీఫ్ బుధవారం నగరంలోని పలు మసీదులు, ఏలూరు బార్ అసోసియేషన్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సుధాకర్, ఎంఎల్సీ ప్రచారకర్త ఏలూరు ఇన్‌చార్జి మహమ్మద్ ఇస్మాయిల్ షరీఫ్ పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

పెదవేగి : మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, మామిడి పంటకు ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం పెదవేగి మండలంలోని పెదవేగి, గార్లమడుగులో మామిడి తోటలను ఆయన పరిశీలించారు. మామిడి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ జిల్లాలో 35వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయని, మూడేళ్లుగా మామిడి చెట్లకు వ్యాధులు సోకి దిగుబడులు లేక రైతులు నష్టపోయారన్నారు. ఉద్యాన పంటలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, ఉచిత పరికరాలు అందించాలని కోరారు. మామిడికి సోకే చీడపీడల నివారణపై ఉద్యానవన శాఖ ద్వారా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. మామిడి తోటలకు ఉచిత పంటల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. రైతులకు తగిన మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

మైక్‌సెట్ బహూకరణ

నిడమర్రు: అడవికొలను పోశింశెట్టి రామమూర్తి జెడ్పీ స్కూల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 2009-10 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు రూ.12వేలు విలువైన మైక్ సెట్‌ను పాఠశాలకు బహూకరించారు. అదే పాఠశాలలో చదివి హైదరాబాద్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న పోలిశెట్టి సతీష్ రూ.5వేలు విలువైన ఆఫీస్ టేబుల్‌ను హెచ్ఎం పి. సుబ్బలక్ష్మికి అందించారు.

● అదుపు తప్పితే ఆసుపత్రికే



వాహనంపై పరిమితికి మించి సామాన్లు వేసి, వాటిపై మనుషులు కూర్చొన్న దృశ్యం ఏలూరు వన్ టౌన్‌లో బుధవారం దర్శనమిచ్చింది. ఇలా పరిమితికి మించి ప్రయాణిస్తే డ్రైవర్ సడెన్ బ్రేక్ వేసినా, కాస్త అదుపు తప్పినా ప్రాణాపాయం తప్పదు. ఇలా ఏలూరు నగరంలోని ఇలా యథేచ్ఛగా వాహనాలు తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రమాదం జరిగక ముందే అధిక లోడు వాహనాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు

సోషల్ మీడియా లింకులు క్లిక్ చేయకండి



మాట్లాడుతున్న సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మధు వెంకట రాజ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సోషల్ మీడియాలో వచ్చే వివిధ లింకులను క్లిక్ చేసి నష్టపోవద్దని ఏలూరు సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.మధు వెంకట రాజ్ సూచించారు. యువజన సర్వీసుల శాఖ సెట్‌వెల్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు వెంకట రాజ్ మాట్లాడుతూ సైబర్ నేరస్తులు ఇటీవల నూతన మార్గాలను అనుసరిస్తున్నారని, సోషల్ మీడియాలో వివిధ లింకులు పంపుతూ వాటిని క్లిక్ చేసే వారి గోప్యతను తస్కరించడమే కాక, బ్యాంక్ అకౌంట్ల నుంచి లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్నారని హెచ్చరించారు. ఏపీకే యాప్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సెట్‌వెల్ సీఈఓ కోట సూర్య ప్రభాకర రావు, ఉపాధి కల్పనాధికారి వి.వరలక్ష్మి, సెట్‌వెల్ మేనేజర్ కె.జాన్ కెనడీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ షోకాజ్ నోటీస్

పెదవేగి : మండలంలోని నడిపల్లి పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై కలెక్టర్ విచారణ చేసి సోకాజ్ నోటీస్ జారీ చేశారు. దుర్వినియోగమైన రూ. 11,80,769ను ముగ్గురు నిందితుల నుంచి రికవరీ చేయాలని పేర్కొన్నారు.